క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల్లో భాగంగా మండలంలోని పీచర, పార్‌పెల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని టౌన్-3 ఏరియాలో 11కేవీ దివ్యనగర్ ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగరాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని దివ్యనగర్, అయ్యప్ప టెంపుల్ ఏరియా, దత్తాత్రేయనగర్, ఏన్‌రెడ్డి కాలనీ, శాస్త్రినగర్ కాలనీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీమా చెక్కు అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామానికి చెందిన బుర్రి సంతోష్ అనే రైతు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన గతంలో మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో పంట రుణం తీసుకొని బీమా ప్రీమియం చెల్లించాడు. మంజూరైన రూ.రెండు లక్షల చెక్కును శుక్రవారం డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. డైరెక్టర్లు ఎ.ముత్యంరెడ్డి, చెవ్వ రాజేశ్వర్, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, చైతన్య, ఉదయ్, మాజీ సర్పంచ్ భూమేశ్ భూమన్న తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన భైరొద్దీన్, రాయపూర్‌కాండ్లీ గ్రామానికి చెందిన సంతోష్, వినోద్‌కుమార్, వెంకటేశ్, సుబ్బలక్ష్మి, దేవేందర్ వారి కుటుంబసభ్యుల పుట్టినరోజు సందర్భంగా అందించిన డబ్బులతో శుక్రవారం నిజామాబాద్‌లోని రైల్వేస్టేషన్‌లో ఫుట్‌పాత్‌పై ఉన్న 33 మంది అనాథలకు మాఅమ్మ-నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేశారు.

పోలీసు బలగాల కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తానూరు: శాంతిభద్రతల పరిరక్షణ కోసమే శుక్రవారం మండలకేంద్రంలో పోలీస్ బలగాల కవాతు నిర్వహించినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. విఠలేశ్వరుడి జాతర, కుస్తీపోటీల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మోర్తాటి వంశీ తండ్రి విజయ్‌కుమార్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు శనిగారపు కమలాకర్, వేల్పుల రమేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమకూర్చిన రూ.5వేలను సాయంగా అందజేశారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

లోకేశ్వరం: మండలంలోని నర్సింహసగర్‌తండాలో జాదవ్ రాజేశ్‌కు చెందిన ఆవు విద్యుదాఘాతంతో శుక్రవారం మృతిచెందింది. రోజు మాదిరిగానే తన ఇంటి వద్ద పశువుల షెడ్డులో ఆవును కట్టేశాడు. షెడ్డులో రేకులకు అమర్చిన ఫ్యాన్‌కు విద్యుత్ సరఫరా అందించే తీగ కట్ అయింది. సదరు తీగ తగిలి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబసభ్యులు గమనించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆవు విలువ రూ.80 వేలు ఉంటుదని.. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు. ఎడ్‌బీడ్ పశువైద్యులు రవీందర్ పంచనామా నిర్వహించారు.

పుస్తక ప్రదర్శన

నిర్మల్‌రూరల్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పాఠకులకు అవసరమైన పోటీపరీక్షల పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, కథల పుస్తకాలు, విజ్ఞానం బోధించే పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఇందులో లైబ్రరియన్లు రాథోడ్ మోహన్‌సింగ్, పృథ్వీరాజ్, సంజీవరెడ్డి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

సోన్: ఇటీవల తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో కథరచన, వచన కవిత, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇందులో సోన్ మండలం వెల్మల్‌బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మొత్కూరి శరణ్య కథ రచనలో ప్రతిభ కనబరిచింది. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలో అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి.. విద్యార్థికి బహుమతి, ప్రశంసాపత్రం అందించారని ప్రధానోపాధ్యాయుడు నాలం విద్యాసాగర్ తెలిపారు. గైడ్ టీచర్‌గా వ్యవహరించిన కొండూరి పోతన్నను, శరణ్యను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

గ్రూప్-4లో అదరగొట్టారు

పేదింటి బిడ్డలు..


సగ్గం నవీన


సామ ప్రశాంత్

సోన్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో మండలంలోని పేదింటి బిడ్డలు సత్తా చాటారు. సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన సగ్గం లత-భాస్కర్ కూతురు నవీన గ్రూప్-4 ఉద్యోగం సాధించింది. నిర్మల్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ(బీఎస్సీ) పూర్తి చేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికై పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించినట్లు నవీన పేర్కొంది. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నామని.. తల్లిదండ్రులకు ఇల్లు కట్టించి ఇస్తానని చెబుతోంది పాక్‌పట్ల గ్రామంలో సామ లక్ష్మి-రాజు దంపతుల కుమారుడు ప్రశాంత్ గ్రూప్-4 ఉద్యోగం సాధించాడు. సమయం వృథా చేయకుండా ప్రిపరేషన్ కొనసాగించడమే తన విజయానికి కారణమని ప్రశాంత్ చెప్పుకొచ్చాడు.


బోయిని రాహుల్

కడెం: మండల కేంద్రానికి చెందిన పీడీ బోయిని వెంకటరమణ-మంగ దంపతుల కుమారుడు రాహుల్ గ్రూప్-4 ఫలితాల్లో ప్రతిభ కనబర్చి మున్సిపల్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. ఉద్యోగం సాధించిన రాహుల్‌ను కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందించారు.



అప్పుడు అక్క.. ఇప్పుడు చెల్లెలు

తల్లిదండ్రులతో రక్షిత, మాధురి

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన వడ్రంగి ఎల్డి లావణ్య-రవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరి పెద్ద కూతురు మాధురి ఇటీవల డీఎస్సీ-2024లో ఎస్జీటీ సాధించగా.. చిన్న కూతురు రక్షిత గురువారం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో ఉద్యోగం సాధించింది.


ప్రవీణ్ కుమార్


జాదవ్ అఖిలేశ్వర్

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన ఎడ్దూర్ భోజన్న-లింగవ్వ దంపతుల కుమారుడు ప్రవీణ్‌కుమార్ గ్రూప్-4 ఫలితాల్లో సత్తా చాటి రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. చిన్నతనంలోనే రేచీకటితో కంటిచూపు కోల్పోయాడు. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో డిగ్రీ, డీఎడ్ పూర్తి చేశారు. భవిష్యత్‌లో గ్రూప్-1 సాధించేలా సన్నద్ధమవుతానని ప్రవీణ్‌కుమార్ చెప్పుకొచ్చాడు.

ఖాళీ సమయంలో సన్నద్ధమయ్యా..

నర్సాపూర్(జి) మండలం బూరుగుపల్లి(కే) గ్రామానికి చెందిన జాదవ్ గంగాధర్-శోభారాణి దంపతుల కుమారుడు జాదవ్ అఖిలేశ్వర్ గ్రూప్-4 ఫలితాల్లో సత్తా చాటి గిరిజన శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. బీటెక్ అనంతరం బ్యాంకు ఉద్యోగాలకు సన్నద్ధమై.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్యాషియర్‌గా , గ్రామీణ బ్యాంకులో క్లర్క్‌గా పని చేస్తూనే ఎల్ఐసీ ఏడీఓ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఫీల్డ్ ఆఫీసర్ ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నారాయణఖేడ్ శాఖలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఖాళీ సమయంలో ప్రిపర్ అయి విజయం సాధించినట్లు పేర్కొన్నాడు

ఓ వైపు ఉద్యోగం చేస్తూనే..


కుంబాల రాజు


సాయికృష్ణరెడ్డి


పల్లికొండ రాజు


బోయిని గంగాధర్

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన కుంబాల రాజు ఓ వైపు ఆదిలాబాద్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూనే గ్రూప్-4 పరీక్షకు సన్నద్ధమయ్యాడు. జిల్లా స్థాయిలో 140వ ర్యాంకు పొంది మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారి పోస్టుకు ఎంపికయ్యాడు. కొరిటికల్ గ్రామానికి చెందిన బోయిని గంగాధర్ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఇతడు మొదటి బెటాలియన్ కానిస్టేబుల్, తర్వాత సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికై దిలావర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నాడు. పంచాయతీ కార్యదర్శి కొలువు వచ్చినా ఉద్యోగంలో చేరలేదు. గ్రూప్-4లో జిల్లా స్థాయిలో 36వ ర్యాంకు సాధించి ఎస్సీ సంక్షేమశాఖలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు.

మండలంలోని కొరిటికల్ గ్రామానికి చెందిన పల్లికొండ రాజు కానిస్టేబుల్‌గా పని చేస్తూ ప్రిపరేషన్ కొనసాగించాడు. గ్రూప్-4లో మున్సిపల్ శాఖలో వార్డు అధికారి పోస్టుకు ఎంపికయ్యాడు.

నల్దుర్తి గ్రామపంచాయతీ కార్యదర్శి రాములు గ్రూపు-4 లో ప్రతిభ కనబర్చి వార్డు అధికారి పోస్టుకు ఎంపికయ్యాడు.

కడెం మండలంలోని మాసాయిపేట్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సాయికృష్ణరెడ్డి గ్రూప్-4లో జిల్లా స్థాయిలో 51వ ర్యాంకు సాధించాడు. మైనారిటీ సంక్షేమశాఖలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు.


బొంతల అనిల్

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన బొంతల అనిల్ గ్రూప్-4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా కొలువు సాధించాడు. గతేడాది ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన అనిల్.. ఉద్యోగానికి సెలవు పెట్టి గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు.


గద్దె అఖిల


జి.ప్రణతి


హరిచరణ్ రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామానికి చెందిన గద్దె లలిత-రఘునందన్ దంపతుల కుమార్తె అఖిల రెవెన్యూశాఖలో ఉద్యోగం సాధించింది. అఖిల ఓ వైపు సివిల్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూనే ఖాళీ సమయాల్లో గ్రూపు-4కు సన్నద్ధమై విజయం సాధించింది.

మండలకేంద్రంలో ఇద్దరు..

లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఏగా పని చేస్తున్న వినోద్-పూర్ణిమ దంపతుల కుమార్తె ప్రణతి రెవెన్యూశాఖలో ఉద్యోగం సాధించింది. లక్ష్మణచాందలోనే స్కూల్ అసిస్టెంట్(తెలుగు)గా పని చేస్తున్న బాపురెడ్డి కుమారుడు కె.హరిచరణ్‌రెడ్డి విద్యాశాఖలో ఉద్యోగం పొందాడు. దీంతో వీరిని గ్రామస్తులు అభినందించారు.


చేపూరి వినయ్

కుంటాల: మండల కేంద్రానికి చెందిన చేపూరి వినయ్ రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్ కొలువు సాధించాడు. వినయ్ తల్లి లక్ష్మీవిశారద ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కాగా.. తండ్రి చంద్రప్రకాశ్ వ్యాపారి. గతంలో వినయ్ పంచాయతీ కార్యదర్శి, ఎఫ్‌బీవో ఉద్యోగాలు పొందాడు. ఉన్నత ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో వాటికి రాజీనామా చేసి పోటీ పరీక్షలకు సిద్ధమై విజయం సాధించాడు.

లోకేశ్వరం మండలం నుంచి..


తరుణ్ తేజ


ప్రవంతి


ప్రశాంత్

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామానికి చెందిన గ్యాకపు ముత్యం-సులోచన దంపతుల కుమారుడు తరుణ్ తేజ గ్రూప్-4లో సత్తా చాటి జ్యోతిబాపూలే గురుకులంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ఎస్ఏగా ఎంపికై ఇప్పటికే ఉద్యోగం చేస్తున్నాడు. మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన ఓంకార్ ప్రవంతి విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా, రాయపూర్‌కాండ్లీకి చెందిన ప్రశాంత్ జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు.

'స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'

సారంగాపూర్: స్థానికసంస్థల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు అన్నారు. మండలకేంద్రంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ.. ప్రజలతో మమేకం కావాలని పిలుపునిచ్చారు. మంతెన గంగారెడ్డి, సిందేకర్ శ్రావణ్‌కుమార్, సీహెచ్ రాజేశ్వర్, సాహెబ్‌రావు, సామల వీరయ్య, నారాయణ, రాజేశ్వర్‌రెడ్డి, విలాస్, తిరుమలచారి, భూమారెడ్డి తదితరులు ఉన్నారు.

ముధోల్: మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ పార్టీ సంస్థాగత ఎన్నికల కార్యశాల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న మాట్లాడారు. సంస్థాగత ఎన్నికల నియమావళి పోలింగ్ బూత్ కమిటీల అర్హత గురించి వివరించారు. మండలంలో ఎన్ని పోలింగ్ బూత్‌లు అర్హత సాధించాయో సమీక్షించి మండల కమిటీలను తయారు చేసుకోవాలని సూచించారు. దేవోజీ భూమేశ్, తాటివార్ రమేశ్, ఉమేశ్ తదితరులున్నారు.

ఆధార్ ఆపరేటర్‌కు అవార్డు

ఖానాపూర్: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని ఆధార్ కేంద్రంలో ఆపరేటర్‌గా పని చేస్తున్న మామిడి గంగస్వప్న ఉత్తమ ఆపరేటర్ అవార్డును గురువారం హైదరాబాద్‌లో అందుకుంది. ఉత్తమ సేవలకు గాను హుడాయ్ రీజినల్ ఆఫీస్ అధికారి సంగీత ఉత్తమ ప్రశంసాపత్రాన్ని ఆమెకు అందజేశారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకంలో కోతల పేరిట మిల్లర్లు, అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో మాట్లాడారు. అబ్దుల్లాపూర్‌లో ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు రోడ్డెక్కారని.. అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కేంద్రాల్లో రైతుల నుంచి కొన్న ధాన్యం మిల్లులకు తరలించే బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణరెడ్డి, నాయకులు విశ్వనాథ్‌పటేల్, సుష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

మహారాష్ట్రలో ప్రచారం..

భైంసాటౌన్: తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసగిస్తోందని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం మహారాష్ట్రలోని నాయగావ్ అసెంబ్లీ పరిధిలోని పాలస్‌గావ్‌తండా, కల్గావ్, సవర్గావ్‌తో పాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించి ప్రజలు మోసపోయారని.. మహారాష్ట్ర ప్రజలు విజ్ఞతతో బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట నారాయణరెడ్డి, బీజేపీ మహారాష్ట్ర, ముధోల్ నాయకులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత


జ్ఞానేశ్వరి పల్లకి ఊరేగింపులో భక్తులు

తానూరు: ఆధ్మాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంత సాధ్యమవుతుందని హరిభక్త పారాయణ తుకారాం మహారాజ్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఎల్వి గ్రామంలో మహాదేవ్ మందిర్ ప్రాంగణంలో వారంరోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం, జ్ఞానేశ్వరి పారాయణం ముగింపు, పల్లకి ఊరేగింపు శోభాయాత్రలో పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ భగవంతుడి సేవలో ఉండాలన్నారు. చిన్నారులు విఠల,రుక్మాయి వేషధారణలో పాల్గొన్నారు. వార్‌కరి భక్తులు తదితరులు ఉన్నారు.

మండల కేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని వారంరోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శుక్రవారం ముగిసింది. కళ్యాకీర్తనలో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన శివాజీ మహారాజ్ పాల్గొని భక్తులకు పలు సూచనలు అందించారు. అనంతరం సప్తాహంలో పాల్గొన్న మహారాజ్‌లను సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర


యజ్ఞంలో పాల్గొన్న భక్తులు


ఆలయం వద్ద భక్తుల సందడి

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ 40వ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అర్చకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో యజ్ఞం, పలు కార్యక్రమాలు, జాతర నిర్వహించగా భక్తులు తరలివచ్చారు. పురవీధుల్లో స్వామివారి రథం ఊరేగించారు. చైర్మన్ చిన్నం సత్యం, కౌన్సిలర్ కిశోర్‌నాయక్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాజన్న, రమేశ్, తదితరులున్నారు.

ఆలయాలకు కార్తిక శోభ


లక్ష్మణచాందలో పూజలు చేస్తున్న దంపతులు


నిర్మల్‌లోని బాగులవాడ శివాలయంలో దీపంతో భక్తురాలు


కుంటాల: కల్లూరులో తులసీమాత కల్యాణం వద్ద భక్తులు


లోకేశ్వరంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కుభీర్/ముధోల్/లక్ష్మణచాంద/భైంసారూరల్/కడెం: కార్తిక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. ఇంట్లో తులసి, ఉసిరి చెట్లకు పూజలనంతరం రాధాకృష్ణుల కల్యాణం జరిపించారు. కడెంలో ఎల్లంకి భూపాల్ దంపతుల ఇంట్లో అర్చకుడు నరేశ్ తులసీమాత కల్యాణం జరిపించారు.

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ , శ్రీ రాజేశ్వర ఆలయం, ఓలా శివాలయం, కుంటాల మహాదేవుని, శ్రీ ఉమామహేశ్వర,శ్రీ మహాలక్ష్మి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మామడ: మండలంలోని బూరుగుపల్లి శివాలయంలో భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని శివాలయంతోపాటు రాయపూర్‌కాండ్లీ, ధర్మోర, పంచగుడి తదితర గ్రామాల్లో తులసీ పూజలు నిర్వహించారు.

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో పురాతన అన్నపూర్ణ మహాదేవాలయం, సీతారామాలయంలో భక్తులు జ్వాలతోరణం దర్శనం చేసుకున్నారు. శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు దీపోత్సవంలో పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మంత్రికి వినతి

భైంసాటౌన్: డీఎస్సీ-2024 ఫలితాల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ విభాగంలో జిల్లాలోనే రెండోర్యాంక్ సాధించిన తనకు ఉద్యోగం రాలేదని.. న్యాయం చేయాలంటూ వీరేశ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరాడు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం వద్ద కలిసి విన్నవించాడు. స్పందించిన మంత్రి సమస్య పరిశీలించాలని కలెక్టర్ అభిలాష అభినవ్‌కు సూచించారు.

ఇళ్లు ఇప్పించాలని పొంగులేటిని కలిసిన పెంచికల్‌పాడ్ గ్రామస్తులు..

కుంటాల: ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని కోరుతూ మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన పలువురు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గుద్దేటి లావణ్య కిష్టయ్య ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మాటేగాంలో వినతిపత్రం అందజేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో తమ గ్రామం ముంపునకు గురైందని.. అప్పటి ప్రభుత్వం 50 ఇళ్లు మంజూరు చేసినప్పటికీ నిర్మించి ఇవ్వలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

ముధోల్: మండలకేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. మండల కేంద్రంలో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఎంపీడీవో శివకుమార్ పరిశీలించారు. వారి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

ఖానాపూర్ మండలంలో..

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్, బీర్నంది, ఎర్వచింతల్, కొలాంగూడ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఎంపీవో చిక్యాల రత్నాకర్‌రావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కుంటాల: సర్వేను బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీవో లింబాద్రి,ఎంపీవో ఎంఏ రహీంఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సిబ్బంది చేపడుతున్న సర్వేను పరిశీలించారు. కుటుంబసభ్యులు సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించాలని వారు కోరారు.